క్లుప్తంగా

మాలలపై చంద్రబాబు విషం కక్కుతున్నారు



సమావేశంలో పాల్గొన్న అశోక్‌కుమార్ తదితరులు

అమలాపురం రూరల్: సుప్రీం కోర్టు తీర్పును గౌరవించకుండా అధికారంలోకి వచ్చాక ఎస్సీ వర్గీకరణ చేసేది తానేనంటూ ఉరవకొండ సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు మాలలపై విషం కక్కడం దారుణమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్ కుమార్ అన్నారు. మాలమహానాడు జిల్లా ముఖ్య నాయకుల సమావేశం అమలాపురంలో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అశోక్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ, టీడీపీలో ఉన్న మాల నాయకులు చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించాలన్నారు. తీరు మార్చుకోకపోతే ఆయా పార్టీల జెండాలను మాలపేటల్లోకి అనుమతించబోమని హెచ్చరించారు. వర్గీకరణ చేసే పార్టీలతో ఏ ఇతర పార్టీ జతకట్టినా ఆయా పార్టీలను భూస్థాపితం చేస్తామని జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో పెయ్యిల పరశురాముడు, పెయ్యిల శ్రీనివాసరావు, నాతి శ్రీనివాసరావు, గూటం సాయి, పరమట రాంప్రసాద్, గిడ్ల వెంకటేశ్వర రావు, మాకే సిద్ధు, బొంతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్ పరామర్శ

అమలాపురం రూరల్: మండలంలోని బండారు లంకకు చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు పడవల సాంబ శ్రవణేశ్వరరావు ఇటీవలే కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆయన కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. శ్రవణేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి విశ్వరూప్ వెంట చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు కాలెపు నాగ శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన గణేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందన శంకరరావు, పెదరాజు తదితరులున్నారు.

రావిపూడి జయంతి

ఐ.పోలవరం: మండలంలోని పశువుల్లంకలో పరిశోధన రచయిత రావిపూడి వెంకటాద్రి 103వ జయంతిని పురస్కరించుకుని ప్రజ్ఞ సాహితీ సభలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రచయిత రావిపూడి రచించిన శతాధిక గ్రంథాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. తొలుత పలువురు రావిపూడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్ రామాంజనేయులు, పత్తి సత్తిబాబు, ఎస్ఎన్ మునీశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, విత్తనాల వరప్రసాదరావు తదితరులున్నారు.

వీరేశ్వరస్వామిని దర్శించుకున్న అసిస్టెంట్ కమిషనర్

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని జిల్లా దేవాదాయశాఖ నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన దూనబోయిన నాగమల్లేశ్వర రావు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ నాగమల్లేశ్వరరావుకు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేసి ఘనంగా సత్కరించారు.

పీవీకి భారతరత్న తెలుగు వారికి గర్వకారణం

ముమ్మిడివరం: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం సముచిత నిర్ణయమే కాకుండా తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని డీసీసీ ఉపాధ్యక్షుడు పి.ఉదయ భాస్కరవర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచమంతా భారతదేశం వైపు చూసేలా ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిన మహా మేధావి పీవీ అని కొనియాడారు.

అభివృద్ధి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యం

- రాష్ట్ర రవాణా మంత్రి పినిపే విశ్వరూప్
- రూ.2.37 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యమిస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం అమలాపురం పురపాలక సంఘ పరిధిలో సాధారణ, 15వ ఆర్థిక సంఘం, గడప గడపకూ మన ప్రభుత్వం నిధులైన రూ.2.37 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. వీటిలో 2, 4వ వార్డుల్లో కాపు కల్యాణ మండపం నుంచి శేషశయన గుడి వరకూ రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, 5, 6వ వార్డుల్లోని సూర్యనారాయణపేటలో రూ.45 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, 27వ వార్డు ఈడబ్ల్యూఎస్ కాలనీలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాలును, 23వ వార్డు లాల్ బహదూర్ శాస్త్రి స్కూల్ నుంచి వినాయక గుడి వరకూ రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, గాంధీనగర్‌లో తిరుగుళ్లవారి వీధిలో రూ 20.లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్(నాని), మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, కౌన్సిలర్లు బండారు గోవిందు, చిత్రపు రామకృష్ణ, కొల్లాటి దుర్గాబాయి, రమేష్, నాగారపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం చిన్న వంతెన వద్ద అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

వేసవిలో తాగునీటి సమస్య రానీయొద్దు

మండల బడ్జెట్ సమావేశంలో ఎంపీపీ జానకి

ఉప్పలగుప్తం: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్, తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జానకి అధ్యక్షతన 2024-25 మండల బడ్జెట్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.57,60,46,000 అన్ని పద్దుల ఆదాయం కాగా వ్యయం రూ.57,60,12,200 అయ్యిందని, దాంట్లో రూ.33,800 మిగులు బడ్జెట్‌గా ఉందని ఎంపీడీవో కొఠారి వెంకటేశ్వర ప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జానకి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మొదలుపెట్టే ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి పనులతో రోడ్ల వెంబడి ఉన్న తుప్పలను తొలగించాలని, రైతులకు ఉపయోగపడే పనులు చేయాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు బద్రి బాబ్జి, జొన్నాడ శ్రీదుర్గ, సలాది ఊర్మిళాదేవి, యర్రంశెట్టి రామచంద్రరావు, పెయ్యిల రాజ్‌కుమార్, కుంచే బుల్లియ్య, చిక్కం జంగమయ్య, ఎంపీటీసీలు పెట్టా అప్పారావు, వంగా గిరిజాకుమారి, కొంకి ఏడుకొండలు, చిక్కం త్రినాథ, అంగాని అనంతలక్ష్మి, వరసాల వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు ఉటాల రామాంజనేయులు, తహసీల్దార్ టి.మల్లికార్జున రావు, ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి తదితరులు పాల్గొన్నారు.



మండల బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జానకి

మేనరిక వివాహాలు నివారించాలి

తాళ్లరేవు: పుట్టబోయే పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మేనరిక వివాహాలు, బాల్య వివాహాలు నివారించాలని రిలయన్స్ దీరూబాయి ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ఫిజియో థెరపిస్ట్ కె.శ్రీకాంత్ సూచించారు. శనివారం పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలోని కమ్యూనిటీ హాలులో గర్భిణులు, స్థానిక ప్రజలకు ఉమా మనోవికాస కేంద్రం, రిలయన్స్ కేంద్రంల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, సకాలంలో వ్యాక్సిన్లు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయకుమారి, కె.నవ్య, కేంద్రం ఇన్‌చార్జ్ గోపాలరావు, ఎస్ఎం స్టీఫెన్, పి.సత్తిబాబు, డి.నాగమణి పాల్గొన్నారు.



పత్తిగొందిలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఫిజియోథెరపిస్ట్ శ్రీకాంత్

క్రమశిక్షణతోనే విద్యాభివృద్ధి

అల్లవరం: విద్యార్థులతు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవరచుకోవాలని, పిల్లలను క్రమశిక్షణలో ఉంచేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. గోడి బాలురు గురుకులం ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ శేషగిరిరావు, ఎస్ఐ హరీష్‌కుమార్ హాజరయ్యారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిత్యం పర్యవేక్షణ ఉంచాలని ఎస్ఐ హరీష్‌కుమార్ సూచించారు. అనంతరం ఎంపీపీ, ఎస్ఐలను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు కాంద్రేగుల వాణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోట హనుమంతరావు, తోట నరసింహరావు, వైఎస్ ప్రిన్సిపాల్ మహ్మద్ ఇబ్రహీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపీపీ శేషగిరిరావు, ఎస్ఐ హరీష్‌కుమార్‌లను సత్కరించిన సర్పంచ్ శ్రీదేవి, గురుకులం సిబ్బంది

ఎమ్మెల్యే ద్వారంపూడి అంటే గౌరవం

యానాం: కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అంటే తనకు వ్యక్తిగతంగా గౌరవమని, ఆయన ఎమ్మెల్యే కాక ముందు 2009 నుంచే ఆయనతో సన్నిహితంగా మెలిగేవాడినని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రాలో కాకినాడ, రామచంద్రపురం, ముమ్మిడివరం ఎమ్మెల్యేలను ఓడిస్తానని మల్లాడి కృష్ణారావు అనడం చాలా హాస్యాస్పదమన్నారు. యానాంలో ఆయన పెట్టిన సీఎం అభ్యర్థి తన చేతిలో ఓడిపోయారని, అలాంటిది ఏపీలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఓడిస్తానని మాట్లాడటం ఆయన నిలకడ లేనితనాన్ని, దిగజారుడు స్థాయిని తెలియజేస్తుందన్నారు. ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన వ్యక్తులకే ప్రాధాన్యముంటుంది తప్ప నామినేటెడ్ పదవిని వెంట బెట్టుకుని అందరినీ శాసిస్తానంటే ఎవరూ ఆమోదించరన్నారు. మల్లాడి ఏపీ రాజకీయాల్లోకి అడుగుపెడితే తాను సైతం వెళ్లి ఆయనకు వ్యతిరేకంగా పనిచేస్తానన్నారు.

ఈ-క్రాప్ నమోదు గడువులోగా పూర్తి చేయాలి

అల్లవరం: వరి సాగు చేస్తున్న ప్రతి రైతు ఈ-క్రాప్, ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. మండలంలోని తాడికోనలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 4,200 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి కాగా, 4,000 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. ఈ నెల 15 వరకూ మాత్రమే పంట నమోదుకు గడువుందని, అన్ని గ్రామాల్లో త్వరితగతిన నమోదు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు రంజిత్‌స్వామి, ఎస్‌కే బిలాల్, రైతులు దాసరి విజయ్‌కుమార్, సబ్బతి సత్తిరాజు, పట్టెం నాగభూషణం, పులిమే కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

ముమ్మిడివరం: రాజమహేంద్రవరంలో మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆధ్వర్యంలో పార్టీల కతీతంగా ఆదివారం జరగనున్న దళిత సింహగర్జన సభకు అధిక సంఖ్యలో నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని దళిత ఐక్య వేదిక పిలుపునిచ్చింది. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం మెండి కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి చెల్లి అశోక్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పార్టీలకతీతంగా సభకు తరలి వెళ్లి దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో దుక్కిపాటి సత్యనారాయణ, వడ్డి శ్యాంప్రసాద్, కాశి లాజర్, బాలరాజు, బడుగు సందీప్‌కుమార్, సిద్దిన పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి పిల్లుల సంరక్షణపై ప్రజలకు అవగాహన

తాళ్లరేవు: చిత్తడి నేలల పరిరక్షణకు ఎంతగానో దోహదపడే నీటి పిల్లులను ఏ విధంగా సంరక్షించుకోవాలనే అంశాలపై అటవీ శాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రపంచ నీటి పిల్లి దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తడి నేలల రాజు, కోరంగి అభయారణ్యం రారాజును కాపాడుకుందాం అనే నినాదంతో అటవీ శాఖ విస్తృత అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టింది. దీంట్లో భాగంగా మండల పరిధిలోని మత్స్యకార గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు మహేష్, ప్రసాద్, ధనంజయరావు తదితరులు నీటిపిల్లి వల్ల అభయారణ్యానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. వాతావరణ పరిస్థితులతో పాటు, పారిశ్రామికాభివృద్ధి తదితర కారణాలతో నీటి పిల్లుల సంఖ్య తగ్గుతుందని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కోరింగ అభయారణ్యంలో ఇటీవల చేపట్టిన గణనలో కేవలం 115 నీటి పిల్లులు మాత్రమే ఉన్నట్లు గుర్తించామన్నారు. నీటి పిల్లులను వేటాడరాదని, వాటి జీవన విధానానికి ఆటంకం కలిగించొద్దని సూచించారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది సత్యనారాయణ, విష్ణు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



గాడిమొగలో నీటి పిల్లి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

ఐ.పోలవరం: పావన వృద్ధ గౌతమీ నదీ తీరం ఎదుర్లంక బాలయోగి వారధి వద్ద కోనసీమ ముఖద్వారం పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ విగ్రహం సుమారు 80 అడుగుల ఎత్తులో కట్టడంతో ప్రయాణికులను, చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. శనివారం ఉదయం విశ్వక్సేన పూజ, గణపతి పూజ, దీక్షాధారణ, వాస్తు శుద్ధి, నవ కలశారాధన, చతుర్దశ కలశారాధన, పంచగవ్యం, క్షీరాధివాసం, జలాధివాసం, ప్రధాన శాంతి హోమం, శిలా విగ్రహ గ్రామోత్సవం, అగ్ని మథనం, కుంభ పూజ, ప్రధాన హోమాలు పండితులు నిర్వహించారు. టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 11.12 నిమిషాలకు పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ దంపతులచే నిర్వహించనున్నట్లు విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన కమిటీ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దంపతులు

మత్స్యకారులకు రూ.94 కోట్ల పరిహారం

- త్వరలో లబ్ధిదారుల అకౌంట్లలో జమ
- ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలోని మత్స్యకారులకు అందాల్సిన ఓఎన్‌జీసీ నష్ట పరిహారం రూపేణా రూ.94,07,69,000 అతి త్వరలో లబ్ధిదారుల అకౌంట్లలోకి జమ కానుందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నష్ట పరిహారం జాప్యమవుతున్న నేపథ్యంలో తాను ఇటీవల న్యూఢిల్లీ వెళ్లి ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిహారం ఇచ్చేలా వారిని ఒప్పించానన్నారు. సోమవారం మొత్తంగా 5,462 మంది లబ్ధిదారులకు గాను రూ.71,76,09,000 పుదుచ్చేరి మెంబర్ సెక్రటరీ ఖాతాలో జమ చేస్తారని చెప్పారు. సదరు సొమ్మును ముఖ్యమంత్రి రంగసామి, మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణ తదితరులు యానాం వచ్చి ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందజేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.23 కోట్లు ప్రభుత్వ ఖాతాలో ఉన్నాయని, ఆ విధంగా మొత్తం రూ.94,07,69,000 లబ్ధిదారుల ఖాతాలో జమవుతాయన్నారు. ఇప్పటివరకూ 14 నెలలకు గాను పరిహారం ఓఎన్‌జీసీ నుంచి వచ్చిందని, కాని మొత్తం పరిహారం తెప్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పరిహారం పంపిణీలో రాజకీయాలకు తావు లేకుండా పూర్తి పరిహారం ప్రతి మత్స్యకారుడికి అందాలన్నదే తన ప్రధాన అభిమతన్నారు. పరిహారం పంపిణీ అనంతరమే అన్ని విషయాలను మాట్లాడతానని స్పష్టం చేశారు.



విలేకరులతో సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

ఆధ్యాత్మిక సేవలు అభినందనీయం

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి శ్రీరామ మందిరంలో నక్షత్ర నవగ్రహ పూర్వక మహా సౌర యాగం నేటి నుంచి ప్రారంభం కానుంది. శనివారం ఈ యాగ ప్రవేశానికి ఎమ్మెల్సీ త్రిమూర్తులు ఆలయానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పురోహితులు మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆయనతో యాగశాల ప్రవేశం చేయించి పూజలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ విలసవిల్లిలో చేపడుతున్న ఆధ్యాత్మిక సేవలు అభినందనీయమన్నారు. నిర్వాహకుడు రామకృష్ణ శర్మ మాట్లాడుతూ గ్రామ శ్రేయస్సు కోసం ఒక్కో నక్షత్రానికి ఒక్కో మొక్కతో రోజూ పూజ చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ నాయుడు, నడింపల్లి గిరిరాజు, జయన సత్తిరాజు, కోలా ఏసు, పుత్సల ఏసు, నందుల సత్య తదితరులు పాల్గొన్నారు.



విలసవిల్లి రామ మందిరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

నవోదయ పరీక్షకు 223 మంది హాజరు

యానాం: 2024-25 విద్యా సంవత్సరానికి గాను 9, 11 తరగతుల్లో ప్రవేశానికి శనివారం నిర్వహించిన నవోదయ పరీక్షకు మొత్తం 123 మంది అభ్యర్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు ఓ ప్రకటనలో తెలిపారు. 9వ తరగతికి 125 మంది, 11వ తరగతికి 98 మంది అభ్యర్థులు ప్రవేశ పరీక్ష రాశారన్నారు. పరీక్షా కేంద్రాలను విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ తనిఖీ చేశారని తెలిపారు.

ఇద్దరిపై దాడి

అల్లవరం: అత్త, అల్లుడి మధ్య జరిగిన ఘర్షణలో గొడవ పడొద్దని ఆపే ప్రయత్నం చేసిన వ్యక్తిపై దాడి చేసిన ఘటన అల్లవరం మండలం ఎంట్రుకోనలో శనివారం చోటు చేసుకుంది. ఎంట్రుకోనకు చెందిన శిరీష, కందికుప్ప గ్రామానికి చెందిన బరువు దుర్గాప్రసాద్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. జీవనోపాధి నిమిత్తం వారిద్దరూ రాజమండ్రిలో నివాసముంటున్నారు. వారం రోజుల క్రితం శిరీషను దుర్గాప్రసాద్ ఎంట్రుకోనలోని పుట్టింటికి పంపించాడు. శనివారం మధ్యాహ్నం భార్య పుట్టింటికి చేరుకున్న దుర్గాప్రసాద్ అత్తతో ఘర్షణ పడ్డాడు. పక్కనే ఉన్న తిక్కిరెడ్డి నరేష్ వారిద్దరి గొడవను ఆపేందుకు ప్రయత్నించాడు. దీంతో దుర్గాప్రసాద్ సమీపంలో ఉన్న రాడ్డుతో నరేష్‌ని, తన అత్తని గాయపరిచాడు. ఘటనపై నరేష్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అల్లవరం ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు.

పల్లెకు పోదాం

తాళ్లరేవు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించేందుకు పార్టీ నిర్వహిస్తున్న పల్లెకు పోదాం కార్యక్రమాన్ని శనివారం తాళ్లరేవులో నిర్వహించారు. స్థానిక కేశవస్వామి బైపాస్ కాలనీలో బీజేపీ నాయకులు కొపనాతి దత్తాత్రేయ వర్మ, విత్తనాల కరిమల స్వామి, యనమండ్ర విజయ్‌కుమార్, కొప్పిశెట్టి అనంతలక్ష్మి, శ్రీనివాస వరప్రసాద్, చిన రాముడు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు.

క్రీడల్లో ప్రతిభను చాటాలి

యానాం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటాలని యానాం పబ్లిక్ స్కూల్ చైర్మన్ చింతా వెంకటరామయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక యానాం పబ్లిక్ స్కూల్‌లో వార్షికోత్సవం, స్పోర్ట్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడాంశాల్లో మెరుగైన ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు మెమోంటోలను, బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పండు అశోక్, డైరెక్టర్లు రెహమాన్, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.